క్లుప్తంగా

నేడు రైతులకు మోటార్ల పంపిణీ

కలికిరి: నియోజకవర్గంలోని రైతులకు జలకల పథకంలో భాగంగా మంజూరైన బోరు మోటార్లను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం 10గంటలకు కలికిరి సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో పంపిణీ చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు హాజరవ్వాలని ఆయన కోరారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 1064 మంది హాజరు

మదనపల్లె సిటీ: నేషనల్ మెరిట్ కం మీన్స్ నమూనా పరీక్షకు 1064 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, హోప్, వివేకానంద, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. 1111 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 1064 మంది హాజరయ్యారు. 47 మంది పరీక్షకు హాజరుకాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరినట్లు ఎంఈఓ తెలిపారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

వాల్మీకిపురం: కుల ఆధారిత డేటాపై అవగాహన, సలహాలు, సూచనలపై ఈ నెల 5వ తేది మంగళవారం ఉదయం 11గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, హాస్టల్ వార్డెన్లు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఏకగ్రీవంగా నియామకం

పీలేరు : పీలేరు క్లాత్ అండ్ రెడీమెడ్స్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీంద్రరెడ్డి, కార్యదర్శిగా ఎన్ఆర్ మురళీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ క్లాత్ అండ్ రెడీమెడ్ షాపు నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

రక్తదానం

పెద్దతిప్పసముద్రం: ఆసుపత్రిలో చికిత్స పొందిన ఓ వ్యక్తికి యంగ్ ఇండియా సేవా సమితి సభ్యుడు రక్తదానం చేసి ఆదుకున్నాడు. వివరాల్లోకి వెళితే బెంగళూరులోని సంజాన్స్ ఆసుపత్రిలో ఓ వ్యక్తికి అత్యవసరంగా రక్తం అవసరమైందని సామాజిక మాధ్యమాల్లో సమాచారం రావడంతో బెంగళూరులోనే ఉంటున్న యంగ్ ఇండియా సేవా సమితి సభ్యుడు దయానంద్ ఆదివారం రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజశేఖర్ పేర్కొన్నారు.

బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం

కలకడ : కలకడ మండలం ఎనుగొండపాళ్యం పంచాయతీ ఆవులప్పగారిపల్లెకు చెందిన చిన్నమనాయుడుని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికచేసినట్లు ఆ పార్టీ ఓబీసి జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్‌లు తెలిపారు. ఆదివారం ఈ మేరకు కలకడలో ఆదివారం నియామకపత్రం ఆందజేశారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడదాం

రాయచోటి అర్బన్ : సమస్యల పరిష్కారం కోసం దళిత ఉద్యోగులందరూ సమష్టిగా పోరాడదామంటూ మేడ్ (మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్) రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్ జిల్లా కార్యవర్గం సమావేశం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల ఐక్యత, అభివృద్ధి, ఆత్మగౌరవం నినాదాలతో మేడ్ పని చేస్తుందన్నారు. అన్నమయ్య జిల్లా మేడ్ అధ్యక్షుడిగా అబ్బవరం హరిబాబును నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్ కడప జిల్లా అధ్యక్షుడు ఎస్.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి చల్లపు రాజారావు, ఉపాధ్యక్షుడు ఎం.రవిప్రకాష్, జిల్లా నేతలు అర్.వెంకటరమణ, పూసపాటి రెడ్డెయ్య, బి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల మున్‌మేల్ శాంతులతో హోమాలు

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ అన్నమాచార్య అకాడమీ పాఠశాలలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏనుగుల బాలాంజనేయులు ఆధ్వర్యంలో శబరిమల మున్‌మేల్ శాంతులచే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు హోమాలు, పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కేరళలోని శబరిమల, మాలికాపురం మున్‌మేల్ శాంతులతో గణపతి హోమం, సరస్వతీ హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. హోమంలో మండలంలోని భక్తులు, అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితానే లక్ష్యం

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మదనపల్లె: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, బీఎల్ఓలకు సూచనలిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటరుజాబితా తయారీకి బీఎల్ఓలు కృషి చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్‌డేలో భాగంగా ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎం.ఎస్. మురళి మదనపల్లె అర్బన్, మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఎల్ఓలకు పలుసూచనలు చేశారు. ఓటుహక్కు నమోదు, తొలగింపు, ఓటుబదిలీకి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో స్పెషల్ క్యాంపెయిన్ డేలో భాగంగా బీఎల్ఓలు తప్పనిసరిగా సాయంత్రం 5 గంటలవరకు ఉండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో సురక్షిత పాలనకు ఓటు వజ్రాయుధమని, ఓటుహక్కు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డిసెంబర్ నెలాఖరువరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు. మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, రూరల్, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండురోజుల పాటు నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ డేలో ఫారం-6లు 1,169, ఫారం-7లు 106, ఫారం-8లు 341, మొత్తం కలిపి 1,626 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ అస్లాం, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్పెషల్ క్యాంపెయిన్

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో రెండు రోజులుగా జరిగిన ఓటర్ల స్పెషల్ క్యాంపెయిన్ ఆదివారం ముగిసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ బీఎల్ఓల ఆధ్వర్యంలో ముసాయిదా, ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. చేర్పుల కోసం 1071, తొలగింపులకు 154, కరెక్షన్స్‌కు 165 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

మండలంలో 210 దరఖాస్తులు

కలికిరి: మండల పరిధిలోని బీఎల్ఓ కేంద్రాల్లో శని, ఆదివారాలు రెండు రోజుల్లో ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులకు సంబంధించి మొత్తం 210 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు భాగ్యలత తెలిపారు. వీటిలో కొత్తగా ఓటరు నమోదుకు 143, తొలగింపునకు 09, మార్పులకు 58 దరఖాస్తులున్నట్లు ఆమె పేర్కొన్నారు. వీటిని పరిశీలించి తదుపరి చర్యలుంటాయన్నారు.

ఓటర్లు జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోండి



కేవీపల్లె : ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

కేవీపల్లె : ఓటర్లు జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని గర్నిమిట్ట, వగళ్ళ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లు తమ పేర్లు పరిశీలించుకోవాలని కోరారు. ఏవైనా తేడాలు ఉంటే బీఎల్‌వోలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు తగవు



ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై నిరాధార ఆరోపణలను ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- నిబంధనల మేరకే లారీ అసోసియేషన్‌కు స్థల కేటాయింపు
- నాగరాజరెడ్డి క్షమాపణ చెప్పి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

మదనపల్లె : వివాదరహితుడైన ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై భూకబ్జాలకు పాల్పడ్డారని కొందరు నిరాధార ఆరోపణలు చేయడం తగదని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో లారీ అసోసియేషన్ స్థల వివాదానికికు సంబంధించి ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణంలోని లారీ యజమానులు, కార్మికులు అందరూ కలిసి, ట్రాన్స్‌పోర్ట్ రంగంపై అవగాహన కలిగిన వ్యక్తిగా, తమ సమస్యల పరిష్కారానికి పెద్దదిక్కుగా ఉంటారనే ఉద్దేశంతో అసోసియేషన్‌కు ఎమ్మెల్యే నవాజ్‌బాషాను అధ్యక్షుడిగా ఎన్నుకున్నామనఅనరు. దాదాపు 25 ఏళ్లుగా లారీ అసోసియేషన్‌కు శాశ్వత భవనంతో పాటుగా లారీల పార్కింగ్‌కు స్థలం కేటాయింపుపై యజమానులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారన్నారు. ఎమ్మెల్యే తమ చిరకాల కోరికను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, మార్కెట్ విలువ చెల్లించి స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకురావడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు మండలంలోని వలసపల్లె గ్రామం సర్వేనెం 711/1లో స్థలాన్ని కేటాయించేందుకు సుముఖత తెలుపుతూ..దరఖాస్తు చేసుకోవాల్సిందిగా చెప్పారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ.. వలసపల్లెకు చెందిన నాయకులు నాగరాజరెడ్డి హైకోర్టు నుంచి స్టేటస్‌కో తేవడం జరిగిందన్నారు. దీనిపై లారీ అసోసియేషన్ నాయకులు కోర్టుకు వాస్తవాలు తెలిపేలోపు.. ఎమ్మెల్యే నవాజ్‌బాషా లారీ అసోసియేషన్ పేరుతో వలసపల్లెలో కోట్లు విలువచేసే భూమిని కబ్జా చేసేశారని పత్రికా ప్రకటనలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో రామసముద్రం జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, సింగిల్ విండోచైర్మన్లు కేశవరెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, నందారెడ్డి, సదాశివరెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ శరత్‌రెడ్డి, రిటైర్డ్ ఏఈ సదాశివరెడ్డి, శశిధరరెడ్డి, రమణారెడ్డి, మహదేవరెడ్డి, బాబురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రంగసముద్రంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ పదవులు ఉన్న నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శభాష్ వలంటీర్



బెంగళూరులో పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమణమ్మ

వాల్మీకిపురం: వలంటీర్లు పరిధి దాటి సేవలందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. పట్టణంలోని కొత్తపేటవీధికి చెందిన సరోజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతోంది. ఇదే ప్రాంతానికి చెందిన వలంటీర్ రమణమ్మ బెంగళూరుకు చేరుకొని సరోజమ్మకు పింఛన్ అందజేసింది. దీంతో పలువురు వలంటీర్ రమణమ్మను అభినందించారు.

అంగన్‌వాడీల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు

రాజంపేట రూరల్ : డిసెంబర్ 8 నుంచి అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్శి ఈ సికిందర్‌లు తెలియజేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి వారికి రావాల్సిన ప్రతిది అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణం కార్మిక సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటయ్య, పి.సుబ్రమణ్యం, ఆటో వర్కర్ అధ్యక్షులు, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తికి మార్గం



కె.బాటవారిపల్లెలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కలకడ : భక్తితోనే ముక్తి మార్గం సాధ్యమని టీటీడీ విశ్వహిందూ పరిషత్ ప్రచార కమిటీ సభ్యులు హరిక్రిష్ణ, బీజేపీ పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ అన్నారు. టీటీడీ ధర్మప్రచార రథం మూడు రోజులుగా చేస్తున్న కోటిహనుమాన్‌చాలీసా పారాయణ మహాయజ్ఞంలో భక్తులు అధికంగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థల సౌజన్యంతో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ అవుట్ డోర్ స్టేడియంలో 21వ తేదీ కోటిహనుమాన్‌చాలీసా సారాయణ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంసఖ్యలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆదివారం మండలంలోని కె.బాటవారిపల్లె, బాలయ్యగారిపల్లె, చలమయ్యగారిపల్లె గ్రామాల్లో రథంలోని శ్రీవెంకటేశ్వరస్వామికి ఇంటింటి పూజలు చేశారు.

రెడ్డెమ్మకొండపై ప్రత్యేక పూజలు



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్తజనసందోహంతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మడుమూరు పంచాయతీ శ్రీనివాసరాయునిపల్లిలో కొత్తగా మంజూరైన సిమెంటు రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సదరు పనులను ఎంపీపీ మహమూద్ ఆదివారం పరిశీలించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ నాగరత్నం నాయుడు, ఎంపీటీసీ పద్మావతి, ఆనందరెడ్డి, సొసైటీ కోఆప్షన్ సభ్యుడు మధూకర్, వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి



ఏఈ వరప్రసాద్

కలకడ : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ వరప్రసాద్ కోరారు. ఆదివారం కలకడ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇంటి గోడలకు ఏర్పాటు చేసిన ఐరన్ విద్యుత్ బోర్డు వలన వర్షానికి షాక్ తగిలే అవకాశం ఉందని గుర్తు చేశారు. స్టాటర్లు, మోటార్లు, స్విచ్ బోర్డులను నేరుగా స్విచ్ ఆన్ చేయడం, ఆఫ్ చేయడం చేయరాదని గుర్తు చేశారు. చెప్పులు వేసుకొని ఆరిన బట్టతో స్విచ్ ఆఫ్, ఆన్ చేయాడం మంచిదన్నారు. విద్యుత్ సిబ్బంది లేకుండా మరమ్మతులు చేయరాదని సూచించారు. 11 కేవీ మెయిన్‌లైన్ దగ్గరకు వెళ్లరాదన్నారు. ట్రాన్స్‌ఫారాలు మరమ్మతుకు గురైనా, ఫీజులు పోయినా తెలుసుకు కదా అని తడి ప్రదేశాలలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. మరో మూడు రోజుల పాటు అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ సంస్థ తెలియజేయడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చిన సమయంలో అధిక విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, ఏసీలు ఆఫ్‌చేసి, వాటి ప్లగ్‌లు సైతం వేరుచేసి ఉంచాలని సూచించారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా స్థానిక విద్యుత్ సిబ్బంది అందబాటులో ఉంటారని, సమాచారం అందించి సేవలు పొందాలని కోరారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలో ప్రతిభ



టీచర్‌తో పాటు విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

ములకలచెరువు: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలో బురకాయలకోట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సత్తా చాటినట్లు హెచ్‌ఎం నాగమోహన్‌రెడ్డి, జీవశాస్త్ర టీచర్ రెడ్డి రాధా ఆదివారం తెలిపారు. విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీలో నిర్వహించిన ఈ పోటీకి తమ పాఠశాలలో ఏడవ తరగతి చదివే అఫ్రా అనే విద్యార్థిని జాతీయ స్థాయి పోటీకి ఎంపికైందన్నారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా యాంటీబయోటిక్ మందులను వాడటం వలన కలిగే దుష్పరిణామాలు, వాటి స్థానంలో సహజంగా లభించే యాంటీ బయోటిక్స్ ఉపయోగించే విధానాన్ని బాలిక అఫ్రా క్షుణంగా వివరించిందని హెచ్‌ఎం తెలిపారు. సదరు బాలికతో పాటు గైడ్ టీచర్‌ను పాఠశాల సిబ్బంది సన్మానించి అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నీళ్లభాస్కర్

వాల్మీకిపురం: పేదల సంక్షేమం, అభివృద్ధి సీఎం జగనన్న ద్వారానే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ అన్నారు. ఆదివారం వాల్మీకిపురం పంచాయతీ నాగంవారిపల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రజలంతా జగన్ వైపు ఉన్నారన్న అక్కసుతో ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. ప్రతిపక్షాలు అధికారంలోకి రావడం సాధ్యపడదన్నారు. రాబోయే ఎన్నికల్లో నూటికి నూరుశాతం ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయుడు, ఆనంద, రమణ పాల్గొన్నారు.

సీనియర్ల సలహాలు పాటించాలి

–నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు



మాట్లాడుతున్న పాఠశాల ప్రిన్సిపాల్ గోవిందరావు

మదనపల్లె సిటీ: విద్యార్థులు సీనియర్ల సలహాలు పాటించాలని స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎంతో పేరుప్రఖ్యాతులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ చదువున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నట్లు తెలిపారు. పాఠశాల పూర్వపు విద్యార్థులు ప్రసాద్, భాస్కర్‌రాజు, మోహన్‌వల్లిలు మాట్లాడుతూ తాము చదువున్న పాఠశాలలో అధ్యాపకులు నేర్పిన పాఠాలు, క్రమశిక్షణ అలవాటు చేసుకోవడంతో మంచి స్థాయిలో ఉన్నామన్నారు. పాఠశాలకు మంచి పేరు తీసుకోవాలని కోరారు. పూర్వపు విద్యార్థులందరూ కలిసి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



వినికిడి యంత్రాలు అందజేస్తున్న వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు వీల్‌చైర్స్ 30, వినికిడి యంత్రాలు 40, ట్రై సైకిళ్లు 2, చేతికర్రలు 60, ఎల్బోస్టిక్స్ అందజేసినట్లు వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. అనంతరం వెలుగు చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ధనుంజయలు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా అత్యవరం ఎదురైతే కంట్రోల్ రూమ్‌లో నియమించిన వీఆర్‌వో చిన్నయర్రయ్య 9701056426కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజలకు మరింత చేరువగా విద్యుత్ సేవలు



విద్యుత్ సబ్ స్టేషన్

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా విద్యుత్ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుతో పాటు పలు విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సబ్ స్టేషన్లు, సెక్షన్ ఆఫీసులు, మీసేవా కేంద్రాలకు వెళ్ళేవారు. సమస్య పరిష్కారం కోసం రోజులు, నెలల తరబడి ప్రజలు తిరగాల్సి వచ్చేది. ఈ కష్టాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయాల్లో 14 రకాల సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సేవలను సులభతరం చేసింది. విద్యుత్ బిల్లుల చెల్లింపులకు కూడా గ్రామ సచివాలయాలకు అనుసంధానం చేసింది.

సచివాలయాల్లో అందే విద్యుత్ సేవల వివరాలు

గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యుత్ సర్వీసుల్లో ఉన్న కేటగిరీలను మార్పు చేసుకునే సౌకర్యం కలదు. విద్యుత్ సర్వీస్ కోసం పేరు మార్చుకునే సౌకర్యం, అదనపు విద్యుత్ లోడ్ కోసం దరఖాస్తు అందజేయవచ్చు. మీటర్ అధికంగా తిరుగుతుండే టెస్టింగ్ చేసుకునే సౌకర్యం కలదు. కాలిపోయిన విద్యుత్ మీటర్ స్థానంలో కొత్త మీటర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యుత్ బిల్లుల్లో వచ్చిన సమస్యలపై ఇర్యాదు చేసుకునే సౌకర్యం, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన ఫిర్యాదులుచేసుకోవచ్చు. హై, లోవోల్టేజి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. విద్యుత్ లైన్లను మార్చడం కోసం ఫిర్యాదు చేసుకునే సౌకర్యం, శిధిలావస్థకు చేరుకున్న స్థంభాలను మార్చేందుకు ఫిర్యాదు చేసుకోవచ్చు. విద్యుత్ మీటర్ ఆగిపోవడం, నెమ్మదిగా, వేగంగా తిరగడం వంటి సమస్యలను తెలియజేయవచ్చు. గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు సౌకర్యం కలదు.

సేవలు సద్వినియోగం చేసుకోండి



గ్రామ సచివాలయాల్లో అందుతున్న 14 రకాల విద్యుత్ సేవలను రైతులు, విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. సమస్యపై సచివాలయంలో ఫిర్యాదు చేస్తే ఎనర్జీ అసిస్టెంట్ త్వరితగతిన సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటారు. - ఉత్తన్న, డిస్కం ఏఈ

ప్రజలకు సులభతరం



సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం శుభ పరిమాణం. గతంలో ప్రజలు ఎలాంటి విద్యుత్ సమస్య వచ్చినా కరంటు ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది.

-సాదిక్ బాషా, వినియోగదారుడు, పెద్దతిప్పముద్రం